సాక్షి ఖమ్మం

గురువారం। 14। మార్చి। 2024




సంకల్పిస్తే సాధ్యమే..
భద్రాచలం అభివృద్ధికి వెనుకాడేది లేదని సీఎం ప్రకటించిన నేపథ్యాన అధికారులు దృష్టి సారిస్తేనే ఫలితముంటుంది. 8లో



రాజ్యాంగ రక్షణే కర్తవ్యం
మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే కర్తవ్యమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం
జిల్లాలో గురువారం గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం ఉంటుంది.



వెళ్తున్నాం.. మళ్లొస్తాం !


హాస్టల్ బయట ఆటోల కోసం లగేజీతో ఎదురుచూస్తున్న విద్యార్థులు


పిల్లల లగేజీ తీసుకొస్తున్న తల్లిదండ్రులు


ఆటోలో సర్దిన సామగ్రి


హాస్టల్ నుండి లగేజీతో బయటకు వస్తున్న విద్యార్థులు

సామగ్రి సహా బస్సు ఎక్కుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం ముగిశాయి. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రైవేట్, ప్రభుత్వ గురుకుల కళాశాలల్లో ఉంటున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. పరీక్ష ముగిసే సమయానికి విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకోగా లగేజీతో సహా పయనమయ్యారు. ద్వితీయ సంవత్సరం తరగతులు మొదలయ్యే సమయానికి మళ్లీ విద్యార్థులు హాస్టళ్లకు చేరుకోనున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

న్యూస్‌రీల్

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో డీఎస్సీ శిక్షణ

ఖమ్మంమయూరిసెంటర్: డీఎస్సీ పరీక్షకు సిద్ధమవుతున్న ఎస్సీ అభ్యర్థులకు ఖమ్మంలోని స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 100మంది అభ్యర్థులకు రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. టీటీసీ లేదా బీఈడీ ఉత్తీర్ణులై టెట్ అర్హత సాధించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 26వ తేదీలోగా టీఎస్ ఎస్సీ స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేసిన వారికి ఏప్రిల్ 3నుండి జూన్ 2వ తేదీ వరకు ఖమ్మంలో శిక్షణ ఉంటుందని వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఆఖరి అవకాశం

ఖమ్మం సహకారనగర్: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు గడువు గురువారంతో ముగియనుంది. ఈ విషయాన్ని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకా అర్హులు ఉంటే సమీపంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఫారం–18 ద్వారా లేదా ceotelangana.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధి అవకాశాలపై యువతకు శిక్షణ


మాట్లాడుతున్న డీఏఓ విజయనిర్మల

ఖమ్మంవ్యవసాయం: గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల తెలిపారు. ఖమ్మంలోని రైతు శిక్షణా కేంద్రంలో ఆత్మ సౌజన్యంతో 'చేపపిల్లల పెంపకం, యాజమాన్య పద్ధతులు' అంశంపై నిర్వహిస్తున్న శిక్షణను ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ యువత ఆర్థికాభివృద్ధికి సాంకేతిక శిక్షణ అవసరమని, మహిళలు కూడా అక్వేరియంలో చేపల పెంపకంపై అవగాహన పెంచుకుని ఉపాధి పెంపొందించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త రవికుమార్, అధికారులు శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, శరత్, రాజేష్, టి.అరుణజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల, ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. ఈమేరకు 21 ప్రొఫెసర్ పోస్టులు, 25 అసోసియేట్ ప్రొఫెసర్, 24 అసిస్టెంట్ ప్రొఫెసర్, 31 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. www.telangana.khammam.gov.in, www.gma.khammam.org వెబ్‌సైట్ల ద్వారా వివరాలు పరిశీలించి గురువారం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, శుక్రవారం ధ్రువపత్రాలు పరిశీలన, ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

తాగునీటి ఎద్దడి రావొద్దు


ప్రజాపాలన దరఖాస్తులపై ఆరా తీస్తున్న సీఈఓ

ఎర్రుపాలెం: వేసవికాలంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ వినోద్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఆయన మండలంలోని తాగునీటి సమస్య, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఎంపీడీఓ సురేందర్, మిషన్ భగీరథ ఇంజనీర్ శ్రీనివాస్‌తో సమీక్షించారు. ఆతర్వాత ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తుల నమోదుపై సూచనలు చేశారు. ఎండాకాలంలో అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని తెలిపారు. ఈజీఎస్ ఏపీఓ నాగరాజు, ఎంపీఓ శ్రీలక్ష్మి, సూపరిండెంట్ ఏ.వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సాగర్ కాల్వల్లోకి గోదావరి జలాలు!

- సీతారామ ప్రాజెక్టు నుంచి వైరా రిజర్వాయర్‌కు మళ్లింపు
- వినోభానగర్ నుంచి తిమ్మరావుపేట వరకు లింక్ కెనాల్
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- పాల్గొన్న మంత్రులు ఉత్తమ్, పొంగులేటి, తుమ్మల


లింక్ కెనాల్‌కు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి, పక్కన మంత్రులు ఉత్తమ్‌కుమార్, తుమ్మల, పొంగులేటి, కలెక్టర్ గౌతమ్, ఎమ్మెల్యేలు రాందాస్, రాగమయి తదితరులు

వైరా: కృష్ణా జలాలు పారుతున్న కాల్వల్లోకి గోదావరి నీటిని మళ్లించాలనే ఆలోచన కార్యరూపం దాలుస్తోంది. తద్వారా సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగర్ ఆయకట్టు భూములకు సాగునీరు అందనుంది. ఈమేరకు లింక్ కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.99.16కోట్లు మంజూరు చేయగా.. బుధవారం వైరా రిజర్వాయర్ సమీపాన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. ఈకార్యకమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం పాల్గొన్నారు.

మొరాయించిన హెలీకాప్టర్

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మధిర నుండి వైరాకు హెలీకాప్టర్‌లో రావాల్సి ఉంది. అయితే, మధిరలో హెలీకాప్టర్ మొరాయించడంతో రోడ్డు మార్గంలో చేరుకున్నారు. ఇక్కడ లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేశాక ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ చీకటి పడుతుండడం.. అప్పటికే హెలీకాప్టర్ వైరాకు చేరుకోవడంతో డిప్యూటీ సీఎం, మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హైదరాబాద్‌కు బయలుదేరారు. దీంతో సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాత్రమే మాట్లాడారు.

ఆగస్టు నాటికి పంటలకు గోదావరి జలాలు

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి జలాలు ఆగస్టు నాటికి పంటలకు చేరేలా నీటి పారుదల శాఖాధికారులు కృషి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు మంజూరు చేశారని తెలిపారు. వైరాలో లింక్ కెనాల్ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగార్జునసాగర్‌లో నీళ్లు లేకపోవడంతో వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని సాగర్ ఆయకట్టు రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ మేరకు గోదావరి జలాలను సాగర్ కాల్వలకు అనుసంధానం చేయాలనే తన కల మేరకు స్వాతంత్ర దినోత్సవం నాటికి పనులు పూర్తిచేయాలని సూచించారు. అయితే, వైరా రిజర్వాయర్‌లోకి మాత్రం జూన్, జూలై నాటికి జలాలు చేరేలా చూడాలన్నారు. ఈ పనులు పూర్తయితే 1.50 లక్షల ఎకరాలకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందని తెలిపారు. డిప్యూటీ సీఎం భట్టి చేతుల్లోనే ఆర్థిక శాఖ కూడా ఉన్నందున నిధుల విషయం ఆయనే చూసుకుంటారని, ఒకవేళ నిధులు మంజూరు కాకపోతే భట్టి స్వగ్రామమైన లక్ష్మీపురం రానివ్వకండని మంత్రి తుమ్మల చమత్కరించారు. ఈ కార్యక్రమంలో వైరా, సత్తుపల్లి ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, డాక్టర్ మట్టా రాగమయి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, సీతారామ ప్రాజెక్ట్ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ శ్రీనివాసరెడ్డి, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణతో పాటు కాంగ్రెస్ నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, కట్ల రంగారావు, దాసరి దానియేలు, ఏదునూరి సీతారాములు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

జలాల మళ్లింపు ఇలా...

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే జూలూరుపాడు మండలం వినోభానగర్ వరకు కాల్వల తవ్వకం పూర్తయింది. మొదట రూపొందించిన ప్రణాళిక ప్రకారం అక్కడి నుంచి గోదావరి జలాలు నేరుగా పాలేరుకు వెళ్లాలి. కానీ వైరా, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లో సాగు అవసరాలకు అందించేలా లింక్ కెనాల్ నిర్మాణానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రతిపాదనల ప్రకారం... ఖమ్మం మీదుగా వెళ్తూ ఏన్కూరు మండలం తిమ్మరావుపేట వరకు ఉన్న ఎన్నెస్పీ ప్రధాన కాల్వ వరకు వినోభానగర్ నుంచి 9 కి.మీ. మేర లింక్ కెనాల్ నిర్మిస్తారు. తద్వారా కాల్వలోకి గోదావరి జలాలను తరలించి అక్కడి ఎస్కేప్ లాక్ ద్వారా వైరా రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. అంతేకాకుండా మెయిన్ కెనాల్ ద్వారా ముందుకు సాగే జలాలు సత్తుపల్లి, మధిర నియోజకవర్గాల్లోని కాల్వలు, జలాశయాలకు చేరడంతో ఆయకట్టుకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందని చెబుతున్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు..


ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి: వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యసేవలపై నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త(డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులను పరిశీలించాక వైద్యులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆతర్వాత డీసీహెచ్‌ఎస్ విలేకరులతో మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలు అందుతుండగా, వైద్యులు, సిబ్బంది 24గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేయనున్నట్లు చెప్పారు. నేలకొండపల్లి సీహెచ్‌సీకి 108 వాహనాన్ని కేటాయించగా, ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్ వాహనం ఉపయోగిస్తే రవాణా చార్జీలు చెల్లిస్తామని తెలిపారు. అనంతరం ఆస్పత్రిలోని సమస్యలపై వంగవీటి నాగేశ్వరరావు, బచ్చలకూరి నాగరాజు, పసుమర్తి శ్రీనివాస్ వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మంగళ, కె.రాజేష్, ఉద్యోగులు రామ్మూర్తి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడేళ్ల తర్వాత కు.ని. ఆపరేషన్లు

నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రి ఒకప్పుడు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో జిల్లాల్లోనే మొదటి స్థానంలో ఉండగా, 2017లో ఎదురైన సమస్యతో అప్పటి వైద్యాధికారిపై గ్రామస్తులు దాడికి యత్నించారు. ఈక్రమంలో ఆమె వెళ్లిపోగా, ఆతర్వాత కు.ని. శస్త్రచికిత్సలు జరగలేదు. ఈవిషయాన్ని ఇటీవల కలెక్టర్ గౌతమ్ ఆస్పత్రికి వచ్చినప్పుడు గుర్తించారు. దీంతో ఆయన సూచనల మేరకు మళ్లీ బుధవారం ఆపరేషన్లను డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తొలిరోజు డాక్టర్ మంగళ నలుగురు మహిళలకు కు.ని. ఆపరేషన్ చేశారు.

ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం


తిరుమంజన వేడుకలో ఉత్సవమూర్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజన వేడుక నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెక్కులు సరే.. నాకేంటి ?!

- కమీషన్ ఇస్తేనే కేఎంసీలో బిల్లులు
- అకౌంట్స్ విభాగం అధికారి తీరుపై ఆరోపణలు
- పాలసీలు సైతం అంటగడుతున్నాడని విమర్శ



అడిగినంత ఇస్తే వెంటనే బిల్లు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో కొందరు అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నా తీరు మారడం లేదు. కాంట్రాక్టర్లు చేసిన పనుల బిల్లులు చెల్లించే సమయాన కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వని వారిని ఇబ్బంది పెడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓ పక్క ఇంజనీరింగ్ అధికారులు పనుల కేటాయింపులో చేతివాటం చూపిస్తుండగా.. మరోపక్క అకౌంట్స్ విభాగంలో ఓ అధికారి తీరు ఇబ్బందిగా ఉందని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. తాజాగా మంగళవారం కేఎంసీ కార్యాలయంలో కాంట్రాక్టర్లు, అధికారులకు మధ్య వివాదం జరగగా, ఈ అంశంపై జోరుగా చర్చ సాగుతోంది. అకౌంట్స్ విభాగంలోని ఓ అధికారి తీరును పలువురు బహిరంగంగానే తప్పుపడుతున్నారు.

కమీషన్లు, పాలసీలు

అభివృద్ధి పనుల బిల్లుల చెక్కులపై సంతకం చేయాలంటే తాను అడిగినంత ఇవ్వడమే కాక ఒక పాలసీ సైతం చేయాలని అకౌంట్స్ విభాగంలోని అధికారి డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. తాజాగా కాంట్రాక్టర్లు, అధికారులకు మధ్య వివాదం జరగగా, చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో.. అకౌంట్స్ విభాగం అధికారిపై కాంట్రాక్టర్లు బాహాటంగానే ఆరోపణలు చేసినట్లు తెలిసింది. అడిగినంత కమీషన్లు ఇవ్వడంతో పాటు ఎల్‌ఐసీ పాలసీ తీసుకోవాలని అధికారి ఒత్తిడి తీసుకొస్తున్నారని వాపోయారని సమాచారం. ఎంతో కొంత ముట్టజెప్పాకే చెక్కు ఇస్తాడని, ఒక వేళ ముందు చెక్కు ఇచ్చినా కమీషన్ కోసం వరుస ఫోన్లతో వేధిస్తాడని ఆరోపించినట్లు తెలిసింది.

అకౌంట్స్ విభాగంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు అధికారి అడిగినంత కమీషన్ ఇచ్చే కాంట్రాక్టర్లకు చకచకా బిల్లులు చేస్తారని సమాచారం. అది కూడా అత్యవసర పనుల కింద బిల్లులు ఇవ్వడంతో వెంటనే నగదుగా మార్చుకునే అవకాశం లభిస్తోంది. ఇక కమీషన్ ఇవ్వని వారికి మాత్రం జనరల్ ఫండ్ కింద చెక్కులు జారీ చేస్తుండడంతో అవి ఎప్పుడు డ్రా చేసుకోవాలో తెలియక సతమతమవుతున్నారని తెలిసింది. ఇటీవల స్థానికేతరుడైన కాంట్రాక్టర్ అడిగినంత డబ్బు చెల్లించడంతో చెక్కులు జారీ చేశాడని స్థానిక కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై సదరు అధికారిని వివరణ కోరగా తన వద్దకు ఎలాంటి బిల్లులు రాలేదని.. వచ్చినప్పుడు ఎవరినీ డబ్బులు అడగలేదని స్పష్టం చేశారు. అంతేకాక ఎల్‌ఐసీ పాలసీలతో తనకు సంబంధం లేదని వెల్లడించడం గమనార్హం.

విచారణ జరిపిస్తాం..



చెక్కుల జారీ సమయాన కమీషన్ డిమాండ్ చేయడం.. ఎల్‌ఐసీ పాలసీలు అంటగట్టడం వంటి అంశాలు నా దృష్టికి ఇప్పటివరకు రాలేదు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరిపిస్తాం. ప్రస్తుతం కాంట్రాక్టర్లు అందరికీ జనరల్ ఫండ్ ద్వారానే చెక్కులు జారీ చేస్తున్నాం.
– ఆదర్శ్ సురభి, కమిషనర్, కేఎంసీ

భవిష్యత్ అవసరాలే కీలకం

- రాష్ట్రంలోనే మోడల్‌గా ఖమ్మం మెడికల్ కాలేజీ
- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన మంత్రులు


మ్యాప్ ఆధారంగా వివరాలు పరిశీలిస్తున్న మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం అర్బన్: భవిష్యత్ అవసరాలే కీలకంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి రెవెన్యూ పరిధిలోని 137, 138, రఘునాథపాలెం రెవెన్యూ పరిధి 218 సర్వే నంబర్‌లోని 30 ఎకరాలను ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు అధికారులు గుర్తించారు. ఈమేరకు ప్రతిపాదిత స్థలాన్ని మంత్రులు కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఏటా విద్యార్థుల సంఖ్య పెరగనుండగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విశాలమైన ప్రాంగణంలో భవన నిర్మాణాలు చేపట్టనున్నామని తెలిపారు. భవిష్యత్‌లో పీజీ, సూపర్ స్పెషాలిటీ కోర్సులు కూడా అందుబాటులోకి రానున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామని.. తద్వారా రాష్ట్రంలోనే ఖమ్మం మెడికల్ కాలేజీని మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు స్వామి, లూథర్ విల్సన్, మెడికల్ కళాశాల అధికారులు, నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, మానుకొండ రాధాకిషోర్, సాధు రమేష్‌రెడ్డి, తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

నియామక పరీక్షల బాధ్యత ఈడీసీఐఎల్‌కు..

- ఈ ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యసాధనకు చేరువయ్యాం..
- సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.వీ.కే.శ్రీనివాస్


మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షలను పారదర్శకంగా చేపట్టేలా దేశంలో పేరుగాంచిన ఎడ్యుకేషనల్ కన్సల్టెంట్ ఇండియా లిమిటెడ్(ఈడీసీఐఎల్) – మినీ రత్న కంపెనీకి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నామని సింగరేణి డైరెక్టర్(పా) ఎన్.వీ.కే శ్రీనివాస్ తెలిపారు. కొత్తగూడెంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈడీసీఐఎల్ ఇప్పటికే కేంద్ర, రాష్ట్రాల పరిధిలో పోలీస్, మిలటరీతోపాటు అనేక నియామకాల పరీక్షలకు 44లక్షల మంది హాజరైనా.. ఎలాంటి తప్పిదాలు లేకుండా నిర్వహించి ఫలితాలు వెల్లడించిందని తెలిపారు. దీంతో సింగరేణిలో చేపడుతున్న నియామక పరీక్షల బాధ్యత కూడా ఈడీసీఐఎల్‌కు ఇవ్వాలని భావిస్తున్నట్లు చెప్పారు. కాగా, సింగరేణి సంస్థ ఈ ఆర్థిక సంవత్సరంలో 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకోగా.. ఈనెల 12వ తేదీ వరకు 65.41 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని, మిగిలిన ఉత్పత్తి కూడా పూర్తిచేసేలా కృషి జరుగుతోందని తెలిపారు. ఇక సంస్థ ద్వారా రానున్న రెండేళ్లలో 550 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధమయ్యాయని వివరించారు. ఈ సమావేశంలో అధికారులు కట్టా బసవయ్య, బి.హన్మంతరావు, ముకుంద సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరుమలేశుని దర్శించుకున్న ఎంపీ


ఆలయం వద్ద ఎంపీ దంపతులు

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర-విజయలక్ష్మి దంపతులు తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. బుధవారం తెల్లవారుజామున స్వామిని దర్శించుకున్న వారికి అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించాలని స్వామిని వేడుకున్నట్లు ఎంపీ తెలిపారు.

ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు పరీక్షకు 18,903మంది విద్యార్థులకు గాను 18,044మంది హాజరయ్యారు. ఇంకా 859మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. జిల్లాలోని 39 పరీక్ష కేంద్రాలను హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్కావడ్ బృందాలు తనిఖీ చేశాయని పేర్కొన్నారు.

లోక్ అదాలత్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల పరిష్కారం

ఖమ్మం క్రైం: ఖమ్మం ఫస్ట్ క్లాస్ స్పెషల్ మొబైల్ కోర్టులో ఈనెల 16న జరిగే మెగా లోక్ అదాలత్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్న వారు హాజరై జరిమానా చెల్లించవచ్చని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. కేసులు ఉన్న వాహనదారులు జరిమానా చెల్లించడం ద్వారా కేసు పరిష్కారమవుతుందని పేర్కొన్నారు. వివరాల కోసం ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్: ద్విచక్రవాహనాన్ని మరో వాహనం వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. సత్తుపల్లి శివారులో బుధవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రేజర్లకు చెందిన మల్లెల్లి విశ్వనాథం(63) ద్విచక్రవాహనంపై సత్తుపల్లి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విశ్వనాథంను సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

తిరుమలాయపాలెం: చెరువుల నుండి అక్రమంగా మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. తిరుమలాయపాలెం పరిధి చెరువుల నుండి మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారనే సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రెండు ట్రాక్టర్లలో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నట్లు తేలడంతో సీజ్ చేశామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని ఏనెకుంట తండాకు చెందిన ఓ వ్యక్తి కానరాకుండా పోవడంతో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. తండాకు చెందిన బానోతు రమేష్ కొద్దినెలలుగా భార్యతో గొడవ పడుతున్నాడు. ఈక్రమంలోనే మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం


మంటలు ఆర్పుతున్న స్థానికులు

నేలకొండపల్లి: మిర్చి లోడ్‌తో వెళ్తున్న లారీ పైభాగం విద్యుత్ వైర్లకు తాకగా, మంటలు అంటుకున్నాయి. స్థానికులు, ఫైర్ సిబ్బంది అప్రమత్తమై మంటలు ఆర్పడంతో ప్రమాదం తప్పినట్లయింది. సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి మిర్చి లోడ్‌తో లారీ బుధవారం ఖమ్మం వస్తోంది. నేలకొండపల్లి సెంటర్‌కు లారీ చేరుకున్నాక విద్యుత్ తీగలు మిర్చికి తాకడంతో మంటలు మొదలయ్యాయి. ఈవిషయాన్ని గమనించిన డ్రైవర్ వాహనాన్ని పక్కన పెట్టగా, స్థానికులు మంటలు ఆర్పుతూనే అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు చేరుకుని అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పగా.. మండల కేంద్రంలో కొద్దిసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,045

సంకల్పిస్తే సాధ్యమే..

- భద్రాద్రిలో మినీ ట్యాంక్‌బండ్ కల సాకారం చేయాలి
- సీఎం కరుణించారు.. అధికారులు చొరవ చూపడమే తరువాయి
- నిర్మాణం పూర్తయితే భద్రగిరికి మరో 'మణిహారం'
- ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలకు మరింత ఊతం


గోదావరి తీరం వెంట కరకట్ట

భద్రాచలం: ఒక వైపు పవిత్ర గోదావరి జల ప్రవాహం.. మరోవైపు వినసొంపుగా వినిపించే రామదాసు కీర్తనలు, కరకట్టపై ఆహ్లాదకరమైన పచ్చటి చెట్లు.. వెరసి భక్తులను, పర్యాటకులను ఆకట్టుకునే సన్నివేశాలు.. ఇవన్నీ భద్రాచలంలోని కరకట్ట పైనుంచి వీక్షించే అవకాశం సాధ్యమేనా అంటే.. అధికారులు చూపే చొరవపైనే ఆధారపడి ఉంటుంది. హైదరాబాద్‌లో ట్యాంక్‌బండ్, ఖమ్మంలో లకారం ట్యాంక్‌బండ్‌కు మించి సహజ సిద్ధమైన ప్రకృతి వనరులు కొలువై ఉన్న భద్రాచలం గోదావరి ఒడ్డున మినీ ట్యాంక్‌బండ్ నిర్మించాలని భక్తులు, పర్యాటకులు కోరుతున్నారు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన అనంతరం ఈ ఊహకు మరింత ఊపొచ్చింది.

అభివృద్ధికి తొలి అడుగు..

భద్రాచలం పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రధానంగా ఇరిగేషన్, దేవాదాయ శాఖలతో సమీక్ష నిర్వహించారు. భద్రాచలం పట్టణం, దేవస్థాన అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తదనుగుణంగా ప్రణాళికలు, నివేదికలను నెల రోజుల్లోపు అందజేయాలని ఆదేశించారు. నిధుల గురించి ఆలోచించకుండా భక్తులు, స్థానికులు, పర్యాటకులకు మేలు జరిగేలా రూపకల్పన చేయాలని సూచించారు. దీంతో భద్రాచలం అభివృద్ధికి తొలి అడుగు పడింది. అయితే పట్టణంలో ఆధ్యాత్మిక, పర్యాటక రంగం మరింత మెరుగుపడేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలని పలువురు కోరుతున్నారు. భద్రాచలం వచ్చిన భక్తులకు పర్ణశాల మినహా చూడదగిన పర్యాటక ప్రాంతం మరొకటి లేదు. సేద తీరేందుకు, ఆహ్లాదకర అనుభూతి పొందేందుకు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న చిన్న పార్కే పెద్ద దిక్కుగా మారింది. బ్రిడ్జి సెంటర్ నుంచి డిగ్రీ కళాశాల వరకు ఉన్న కరకట్టను మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దితే భద్రాచలం క్షేత్రానికి మరో మణిహారంగా మారనుంది. మధ్యలో టీ, కాఫీ షాపులను, వ్యూ పాయింట్‌లను ఏర్పాటు చేసి పర్యాటకులను మరింత ఆకర్షించవచ్చు. భద్రాచలం క్షేత్ర, రామాయణ ఇతివృత్తాలతో పాటుగా ఆదివాసీల జీవన శైలి తెలిపేలా మ్యూజియాలు, పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లు, రంగురంగుల ఫౌంటెన్‌ల ఏర్పాటుకు అవకాశం ఉంది. ఇక సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులకు గోదావరిలో జలవిహారం చేసే అవకాశం కలుగుతుంది. తద్వారా అటు పర్యాటక రంగాభివృద్ధితో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

తొలగనున్న డంపింగ్ యార్డు సమస్య..

గోదావరి నది కరకట్టపైనే గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డు కొద్ది సంవత్సరాలుగా భద్రాద్రి వాసులకు, భక్తులకు పెద్ద సమస్యగా మారింది. ఇప్పుడు ట్యాంక్‌బండ్ నిర్మిస్తే ఈ సమస్య తీరనుంది. డంపింగ్ యార్డును కరకట్ట నుంచి మనుబోతు చెరువు సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంలోకి మారుతుంది. ఇక్కడ ఇప్పటికే రూ.80 లక్షల వ్యయంతో తడి, పొడి చెత్తను వేరు చేసేందుకు డ్రైవేస్ట్ రిసోర్స్ కలెక్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇది అమల్లోకి వస్తే కరకట్ట సుందర వనంగా మారేందుకు మార్గం సుగుమం అవుతుంది. ఈ మేరకు కలెక్టర్ ప్రియాంక ఆల ప్రత్యేక దృష్టి సారించాలని, ఆ దిశగా ఇరిగేషన్, దేవస్థానం అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేయించాలని పలువురు కోరుతున్నారు.

మినీ ట్యాంక్‌బండ్ కల సాకారం చేయాలి



భద్రాచలంలో భక్తులు, పర్యాటకులు, స్థానికులకు కలగా ఉన్న మినీ ట్యాంక్‌బండ్‌ను ప్రభుత్వం నిర్మించాలి. ట్యాంక్‌బండ్ నిర్మాణంతో ఇక్కడ ఆధ్యాత్మిక, పర్యాటక రంగాలు అభివృద్ధి చెందుతాయి. తద్వారా వీటిపై ఆధారపడే వారికి జీవనోపాధి లభిస్తుంది. భద్రాచలం దివ్యక్షేత్రానికి జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు వస్తుంది.

– పరిమి సోమశేఖర్, భద్రాచలం

మా చిరకాల కోరిక నెరవేరింది..

పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి


సీఎం, మంత్రి తుమ్మల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: పద్మశాలీ కులస్తుల కోసం కార్పొరేషన్ కావాలన్న తమ చిరకాల స్వప్నం కాంగ్రెస్ ప్రభుత్వంతో సాధ్యమైందని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి తెలిపారు. ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రకటన చేసిన నేపథ్యాన బుధవారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం మురళి మాట్లాడుతూ ఏళ్లుగా కార్పొరేషన్ కోసం పోరాడుతుండగా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పుడు 16 కార్పొరేషన్లను ఏర్పాటుచేయడం హర్షణీయమని, తద్వారా కులస్తుల అభ్యున్నతి సాధ్యమవుతుందని చెప్పారు. సంఘం నాయకులు చిలకమర్తి శ్రీనివాసరావు, పెండెం జనార్దన్, బండారు శ్రీనివాస్, దుస్సా సత్యనారాయణ, కొండల్‌రావు, రాజేందర్, భాస్కర్, రవి, శ్రీధర్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుపై..


సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరు కాపు సంఘం నాయకులు

ఖమ్మం వన్‌టౌన్/ఖమ్మం మామిళ్లగూడెం: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఖమ్మంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్పొరేటర్ రాపర్తి శరత్, నాయకులు నరేష్‌నాయుడు, నర్సింహారావు, మదూరి సైదారావు, సముద్రాల శ్రీను, రామకృష్ణ, రమణ, విప్లవ్‌కుమార్, నాగేశ్వరావు, సునీల్, సముద్రాల శ్రీనివాసరావు, గంగిశెట్టి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఖమ్మంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మున్నూరుకాపు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసమావేశంలో నాయకులు కనిశెట్టి విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, మారిశెట్టి వెంకటేశ్వరావు, నర్సయ్య, పొన్నం వెంకటేశ్వర్లు పూర్ణచందర్‌రావు, కోటేశ్వరావు, పారా ఉదయ్ పాల్గొన్నారు

ఆరేళ్లలో ఏడు ఉద్యోగాలు!

- మంగాపురం తండా వాసి ఘనత
- సివిల్స్ సాధనే లక్ష్యంగా గాంధీ కసరత్తు


భూక్యా గాంధీ

నేలకొండపల్లి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే కష్టంగా ఉంది. అయినా ఇటీవల కొందరు రెండు, మూడు ఉద్యోగాలు సాధించారు. కానీ కుగ్రామానికి చెందిన ఓ యువకుడు మాత్రం ఒకటి, రెండు కాదు ఆరేళ్ల కాలంలో ఏకంగా ఏడు ఉద్యోగాలు సాధించాడు. అంతటితో సంతృప్తి పడకుండా ఉద్యోగం చేస్తూనే సివిల్స్ సాధించడమే లక్ష్యంగా సిద్ధమవుతుండడం విశేషం.

గిరిజన తండా నుంచి...

నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండా మండల కేంద్రానికి సుదూరాన ఉండగా, ఈ గ్రామస్తులు ఎర్రబస్సు కూడా ఎరగరు. ఈ గ్రామానికి చెందిన భూక్యా నాగేశ్వరరావు–బాలమ్మ కుమారుడు గాంధీ చిన్నతనం నుంచే కష్టపడుతూ మంగాపురం, నాచేపల్లి, నేలకొండపల్లి ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజీలో చదివి మంచి మార్కులు సాధించాడు. అనంతరం డిగ్రీ కోదాడలో, బీఈడీ నకిరేకల్‌లో, ఎమ్మెస్సీ గుంటూరులో పూర్తిచేసిన గాంధీ ఆతర్వాత ఉద్యోగ పరీక్షలు రాయడం మొదలుపెట్టారు. తొలుత 2017 జూన్ 2న రాజమండ్రిలో బ్యాంక్ ఆఫ్ బరోడాలో సబ్‌స్టాఫ్ ఉద్యోగం సాధించాడు. ఆతర్వాత అదే ఏడాది సెప్టెంబర్ 11న లక్షద్వీప్‌లోని జవహర్ నవోదయ విద్యాలయలో పీఈటీగా, 2018 మే 5న ఖమ్మం మైనార్టీ గురుకుల విద్యాలయం, 2019 ఏప్రిల్ 8న ఇల్లెందులోని మైనార్టీ గురుకుల విద్యాలయంలో పీజీటీగా, 2019 ఆగస్టు 20న కర్ణాటకలోని కేంద్రియ విద్యాలయం టీజీటీగా, 2023 నవంబర్ 30న కేరళలో టీజీటీగా ఉద్యోగం సాధించిన గాంధీ తాజాగా ఈనెల 4న బీసీ గురుకుల జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గానూ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఇల్లెందు మైనార్టీ గురుకులంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన తనకు కలెక్టర్ గౌతమ్, డీఆర్‌డీఓ సన్యాసయ్య స్ఫూర్తి అని చెబుతున్నాడు. అయితే, అటు ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రూప్స్‌తో పాటు సివిల్స్ కూడా సిద్ధమవుతున్నానని, ఎప్పటికైనా సివిల్స్ సాధించడమే లక్ష్యమని తెలిపాడు. తన విజయంలో తల్లిదండ్రులు, కుటుంబీకుల కృషి ఉందని గాంధీ వెల్లడించాడు.

అరుదైన 'గిరి నాగుపాము' ప్రత్యక్షం


అరుదైన గిరి నాగుపాము

అశ్వారావుపేటరూరల్: దట్టమైన అటవీ ప్రాంతాల్లో సంచరించే చాలా అరుదైన ఓ 'గిరి నాగుపాము' బుధవారం కనిపించింది. అశ్వారావుపేట మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోగల గోపన్నగూడెం గ్రామం శివారులో మాజీ సర్పంచ్ గొంది లక్ష్మణ్‌రావు వ్యవసాయ పొలంలో ఈ పాము ప్రత్యక్షమైంది. ఈ పాము దాదాపు 12 నుంచి 15 అడుగుల పొడవు దాకా ఉంటుంది.

యువకుడి బలవన్మరణం

- ప్రేమ వ్యవహారంలో యువతి బంధువుల దాడే కారణం?

ఖమ్మం క్రైం: ప్రేమ వ్యవహారంలో యువతి తరఫు బంధువులు తరచూగా దాడి చేస్తుండడంతో మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువుల కథనం ప్రకారం ఖమ్మం రేవతి సెంటర్‌ సమీపాన నివసించే దివ్యాంగుడు దేవత్ రవి – జ్యోతి దంపతుల కుమారుడు హరి(19) బస్టాండ్‌లో కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన ఓ యువతిని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో ఆమె బంధువులు తరచూ దాడి చేస్తున్నట్లు తెలిసింది. ఓ ప్రధాన పార్టీ నాయకుడి అండతో మంగళవారం కూడా హరిపై దాడి చేసి కొట్టారు. దీంతో మనస్తాపానికి గురైన హరి ఇంట్లోనే బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు హరి మరణానికి కారకులపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌తో ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆయన తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. తమ కుటుంబానికి దిక్కు లేకుండా పోయిందని వారు వాపోయారు. ఈసందర్భంగా ఉద్రిక్తత నెలకొనగా ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చింతకాని: మండలంలోని ప్రొద్దుటూరులో పేకాట స్థావరాలపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4,700 నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

కల్వర్టును ఢీకొట్టిన లారీ

- గంటన్నర పాటు నిలిచిన రాకపోకలు


రహదారి అడ్డంగా నిలిచిపోయిన లారీ

కామేపల్లి: ప్రమాదవశాత్తు కల్వర్టును లారీ ఢీకొట్టగా... గంటన్నర పాటు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వివరాలు.. ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై కామేపల్లి మండలం పండితాపురం బైపాస్ సమీపాన కల్వర్టును బుధవారం ఉదయం ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈమేరకు లారీ ప్రధాన రహదారిపై అడ్డంగా నిలిచిపోవడంతో గంటన్నర పాటు ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో వాహనాలను పండితాపురం మీదుగా ముచ్చర్ల క్రాస్ రోడ్డుకు మళ్లించారు. అనంతరం జేసీబీతో లారీని పక్కకు తొలగించాక రాకపోకలు మొదలయ్యాయి.

బీజాపూర్‌లో ఎదురుకాల్పులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పలువురు మావోయిస్టులు తప్పించుకొని పారిపోగా ఓ ఆదివాసీ మహిళకు గాయాలయ్యాయి. ఈ ఘటన బీజాపూర్ జిల్లాలోని బైరంగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. బీజాపూర్ జిల్లా ఎస్పీ జితేంద్ర యాదవ్ కథనం ప్రకారం.. బైరంఘడ్ పోలీస్‌స్టేషన్ పరిధి బోడ్గా గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బలగాలు మంగళవారం కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తారసపడిన మావోయిస్టులు పోలీసు బలగాలపైకి కాల్పులు జరుపుకుంటూ బోడ్గా గ్రామం వైపు పారిపోయారు. వారి వెంబడిస్తూ పోలీసు బలగాలు బోడ్గా గ్రామానికి చేరుకోగా, అప్పటికే గ్రామంలోకి చేరుకున్న మావోయిస్టులు మరోసారి మళ్లీ కాల్పులు జరపడంతో పోలీసులు సైతం ఎదురుకాల్పులు కొనసాగించారు. ఈ క్రమంలో పోలీసులు జరిపిన ఎదురుకాల్పుల్లో బోడ్గా గ్రామానికి చెందిన రాజే ఓయం అనే ఆదివాసీ మహిళకు బుల్లెట్ గాయాలయ్యాయి. కాల్పుల అనంతరం మావోయిస్టులు అక్కడ నుంచి తప్పించుకొని అడవిలోకి పారిపోయారు. గాయపడ్డ మహిళను బైరంగఢ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం, జగదల్పూర్ వైద్యశాలకు మెరుగైన చికిత్స కోసం తరలించారు. కాగా తప్పించుకున్న మావోయిస్టుల కోసం బోడ్గా సమీప అటవీ ప్రాంతంలోకి అదనపు బలగాలను తరలించి కూంబింగ్ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. అయితే ఈఏడాది జనవరి 30న బోడ్గా గ్రామంలో ఇదే తరహాలో జరిగిన ఎదురుకాల్పుల్లో గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ వ్యక్తి మృతి చెందగా ఇప్పుడు తాజాగా పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఆదివాసీ మహిళ గాయాలపాలైన సంఘటన చోటు చేసుకుంది.

రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే కర్తవ్యం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సమావేశంలో మాట్లాడుతున్న తమ్మినేని

ఖమ్మంమయూరిసెంటర్: మతోన్మాద శక్తుల నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే కమ్యూనిస్టుల ప్రధాన కర్తవ్యంగా ఉండాలని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన పాలేరు నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చడంతో పాటు అసలు రాజ్యాంగమే లేకుండా మనువాదాన్ని అమలుచేసేందుకు మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. దీన్ని తిప్పికొడుతూనే ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడడం ద్వారా ప్రజా మద్దతును పొందగలుగుతామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. వేసవి తీవ్రతతో నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నందున ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే, ఆరు గ్యారంటీల అమలులో అవకతవకలు జరగకుండా రాష్ట్రప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం పాలేరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండి రమేష్ మాట్లాడుతూ సాగు, తాగునీటి సమస్య ఉన్నందున పాలేరు పాత కాల్వకు సాగర్ నీటిని విడుదల చేయాలనే డిమాండ్‌తో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు కొమ్ము శ్రీను, బుగ్గవీటి సరళ, షేక్ బషీరుద్దీన్, నండ్ర ప్రసాద్, ఊరడి సుదర్శన్‌రెడ్డి, గొడవర్తి నాగేశ్వరరావు, ఎడవల్లి రమణారెడ్డి, అంగిరేకుల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

'కమ్మ' కార్పొరేషన్ కూడా ఏర్పాటు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అన్ని కులాలకు ప్రకటించినట్లుగానే కమ్మ కులస్తులకు కూడా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కమ్మ మహాజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు కోరారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే, కమ్మ కులస్తుల్లోనూ వెనుకబడిన కుటుంబాలు ఉండగా ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించిన కమ్మ కులస్తుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి గొడవర్తి నాగేశ్వరరావు, నాయకులు రావూరి సైదుబాబు, తుళ్లూరి నిర్మల, తూము శివ, బండి మాధవరావు, నున్నా నవీన్ తదితరులు పాల్గొన్నారు.

దూదేకులకు కూడా..


మాట్లాడుతున్న షేక్ సయ్యద్ బాషా

ఖమ్మం మామిళ్లగూడెం: దూదేకుల సంక్షేమానికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నూర్‌బాషా, దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సయ్యద్‌బాషా కోరారు. ఖమ్మంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుపై గత ప్రభుత్వానికి అనేకమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కొత్తప్రభుత్వం అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటుచేసిన నేపథ్యాన దూదేకులకు కూడా కార్పొరేషన్ ప్రకటించాలని కోరారు. కాగా, ఏపీలో ఐదేళ్ల క్రితమే దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటుచేశారని ఆయన తెలిపారు. ఈసమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ రహీంతో పాటు జానీబేగం, సబినాబీ, షేక్ రహీంపాషా, షేక్ రసూల్, లాల్‌సాహెబ్ పాల్గొన్నారు.

ఘనంగా హాస్టల్ వార్షికోత్సవం


హాస్టల్ డేలో మాట్లాడుతున్న డీడీ సత్యనారాయణ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం 'ఏ'లో బుధవారం హాస్టల్ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంక్షేమ అధికారి నెల్లూరి విజయ అధ్యక్షత వహించగా, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు విద్యార్థులు ఉపయోగించుకుంటూ శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు మెరుగైన జీపీఏ సాధించి సత్తా చాటాలని తెలిపారు. ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీలత, వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావుతో పాటు ఎం.విజయలక్ష్మి, ఝాన్సీరాణి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

సందడిగా 'బ్లూమింగ్ మైండ్స్' వార్షికోత్సవం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కల్నల్ నవీన్, పాఠశాల యాజమాన్యం

ఖమ్మం అర్బన్: ఖమ్మం బల్లేపల్లిలోని బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్ వార్షికోత్సవ వేడుక బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఎన్‌సీసీ 11వ బెటాలియన్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్‌యాదవ్, డీఈఓ ఈ.సోమశేఖరశర్మ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని, తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. పాఠశాల చైర్మన్ భీమిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడగా పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.